ఇవండీ సంగోతులు

- దయనీయంగా ముమ్మిడివరం–ముక్తేశ్వరం రోడ్డు పరిస్థితి
- నాలుగు నియోజకవర్గాల ప్రజలకు తప్పని తిప్పలు
- నిత్యం పదివేల మంది ప్రయాణం
- అధ్వాన రోడ్డుతో తగ్గిన బస్సు సర్వీసులు

అయినవిల్లి: ముమ్మిడివరం మండలం నుంచి అయినవిల్లి మండలం మీదుగా కొత్తపేట మండలం వరకూ, ముమ్మిడివరం నుంచి అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం మీదుగా అమలాపురం ఈ రోడ్డు విస్తరించి ఉంది. పైన చెప్పినవి మండలాలే కానీ ముమ్మిడివరం, అమలాపురం, పి. గన్నవరం, కొత్తపేట నియోజక వర్గాల్లో ముఖ్యమైన మండలాలు. ఈ రోడ్డు ముమ్మిడివరం నుంచి అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం వరకూ పది కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ముమ్మిడివరం నుంచి కె.జగన్నాథపురం (ఆరు కిలోమీటర్లు) వరకూ ప్రయాణం ఓ మోస్తరు ఫర్వాలేదు. కె.జగన్నాథపురం నుంచి ముక్తేశ్వరం (4 కిలోమీటర్లు) వరకూ ప్రయాణం నరకాన్ని చూపిస్తోంది. రోడ్డు ఎక్కడ చూసిన మోకాళ్ల లోతు గుంతలు, చిన్నపాటి వర్షానికే రోడ్డు చెరువును తలపిస్తుంది. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు సంభవిస్తుంటాయి. మూడు నియోజకవర్గాల్లోని ప్రధాన ఆలయాలైన మురమళ్ల వీరేశ్వరస్వామి, అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి, వానపల్లి పళ్లమాంబిక, వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య ఈ రోడ్డులో అధికంగా ఉంటుంది. కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం వెళ్లడానికి ఈ రహదారే గతి. అంతే కాకుండా జిల్లాలోని వివిధ అధికార కార్యాలయాలు ముమ్మిడివరం నియోజక వర్గంలో శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నాయి. వీటికి వెళ్లడానికి ఇదే రహదారి. అంతే కాకుండా నిత్యం ఈ రహదారిపై పదివేల మంది పైనే ప్రయాణం సాగిస్తుంటారు. మురమళ్ల నుంచి ముక్తేశ్వరం మీదుగా కొత్తపేట, రావులపాలెం, బొబ్బర్లంక వరకూ, ముమ్మిడివరం, అమలాపురం వరకూ బస్సు సర్వీసులు నడిచేవి. అలాగే అమలాపురం కూడా ముమ్మిడివరం కె.జగన్నాథపురం మీదుగా సర్వీసులు నడిచేవి. నిత్యం ప్రతి అరగంటకు బస్సు సర్వీసులు నడిచేవి. రోడ్డు పరిస్థితి చూసి భయంతో సమయాన్ని బేరీజు వేసుకోకుండా, ప్రమాదాలకు గురికాకుండా అటు అమలాపురం మీదుగా చుట్టూ తిరిగి మరి ప్రయాణం కొనసాగిస్తున్నారు. అలాగే భారీ లోడుతో వాహనాలు వెళ్లాయి. ఈ రోడ్డు అంటేనే భయపడి ఈ చుట్టుపక్కల ప్రాంతాలకు కనీసం ఆటో వాళ్లు కూడా రావడానికి భయపడుతున్నారు. ఈ రోడ్డు వెంబడి ఉన్న గ్రామాల్లో వ్యాపారాలు పూర్తిగా మందగించాయి. ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయక వ్యాపార కూడలిగా వెలిగిన ముక్తేశ్వరం, తొత్తరమూడి, కె.జగన్నాథపురం, క్రాప గ్రామాల్లో వ్యాపారాలు బోసిపోయాయని స్థానికులు చెబుతున్నారు.

అది పేరుకు ముమ్మిడివరం–ముక్తేశ్వరం ఆర్అండ్‌బీ రోడ్డు. అయితే ఈ రహదారి నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడుతోంది. పదిహేనేళ్లుగా ఈ రోడ్డు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రోడ్డును ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఎంత మొత్తుకున్నా ఇసుమంత కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి చేయలేదు. పర్యవసానంగా వర్షాల సమయంలో ఈ రోడ్డు చెరువును తలపిస్తుంది. ఈ దారిన ప్రయాణించే ప్రయాణికులైతే ఈ రోడ్డుపై కాదు కాదు చెరువులో చేపలో లేదంటే కొంచెం నీరు తగ్గాక వరి, మొక్కజొన్న వంటి పంటలు వేస్తే కాసంత దిగుబడి వచ్చి ఈ వచ్చిన సొమ్ముతో అయినా రోడ్డు వేసేయొచ్చేమో అంటూ నిట్టూరుస్తుంటారు.


కె.జగన్నాథపురంలో అధ్వానంగా ఉన్న ముమ్మిడివరం–ముక్తేశ్వరం రహదారి


ముక్తేశ్వరంలో చెరువును తలపిస్తున్న ముమ్మిడివరం–ముక్తేశ్వరం ఆర్అండ్‌బీ రహదారి

రోడ్డు అభివృద్ధి చేసిన పాపాన పోలేదు



ఈ రోడ్డును అభివృద్ధి చేసి పదిహేనేళ్లయింది. అప్పటి నుంచి ఈ రోడ్డును అభివృద్ధి చేసిన పాపాన పోలేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేక మార్లు వివరించాం. అయినా ఫలితం లేదు. రోడ్డు గుంతలుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డును ఇప్పటికైనా అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాం. – శ్రీకాకోళపు రాధాకృష్ణ (రోశయ్య), కె.జగన్నాథపురం

వ్యాపారాలు దెబ్బతిన్నాయి



ఈ రోడ్డుపై ప్రతి అరగంటకు బస్సు సర్వీసులు నడిచేవి. రోడ్డు దెబ్బతినడంతో ఇప్పుడు రోజుకు రెండు నుంచి మూడు సర్వీసులు మాత్రమే తిరుగుతున్నాయి. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై అంతగా ప్రయాణాలు సాగక పోవడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయి. రోడ్డును అభివృద్ధి చేయాలి. – మట్టపర్తి గణపతిరావు, కిరాణాషాపు యజమాని, తొత్తరమూడి

నిధులు మంజూరయ్యాయి



ముమ్మిడివరం–ముక్తేశ్వరం ఆర్అండ్‌బీ రోడ్డు కె.జగన్నాథపురం నుంచి ముక్తేశ్వరం వరకూ నాలుగు కిలోమీటర్లు మేర అభివృద్ధి చేసేందుకు ఎన్డీబీ నిధులు రూ.11.86 కోట్లు మంజూరయ్యాయి. అయితే రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. ఈ టెండర్ రద్దు చేసి కొత్త టెండర్ పిలిచేందుకు ఉన్నత స్థాయి అధికారులకు నివేదించాం. – టీఎస్‌వీ రమేష్, ఆర్అండ్‌బీ జేఈ, అయినవిల్లి

క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యాసరాల పంపిణీ


అప్పనపల్లిలో వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న రిటైర్డ్ ఐఆర్ఎస్ మూర్తి

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన గోదావరి వరద బాధితులు 200 మందికి తాళ్ల సరస్వతమ్మ, ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసరాలు కిట్లు అందజేశారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ ఉద్యోగి తాళ్ల సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గోదావరి వరదల వల్ల పేదలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, వారికి మానవతా దృక్పథంతో ట్రస్టు తరఫున సహాయం అందించాలని నిర్ణయించామని టీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ట్రస్టు అందిస్తున్న సేవలను ఏఎంసీ మాజీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, మాజీ సర్పంచ్ పిచ్చుక చిన్న కొనియాడారు. కార్యక్రమంలో తులా గోపాలకృష్ణ, కంకిపాటి వెంకటేశ్వరరావు, తులా నాగరాజు, యేడిద లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటాం


సఖినేటిపల్లి లాకుపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సఖినేటిపల్లి: వరద ముంపు బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం సఖినేటిపల్లి లాకుపేట, గీతామందిరం ఏరియాల్లో వరద ముంపు బాధితులను ఆయన పరామర్శించారు. ఈ మేరకు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంట డీటీ సీహెచ్ భాస్కర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు డీఏల వినతి

మలికిపురం: కోనసీమ జిల్లా పంచాయతీ సెక్రటరీ గ్రేడ్‌–6 డిజిటల్ అసిస్టెంట్(డీఏ)ల యూనియన్ సభ్యులు శనివారం మలికిపురంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ని కలిశారు. తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. సచివాలయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రమోషన్ చానల్, పే స్కేల్, తదితర అంశాలపై వినతిపత్రంలో వివరించారు. మన రాష్ట్రంలోని 35 ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అలాగే అర్హత కలిగిన వారిని విద్యా శాఖలో కంప్యూటర్ టీచర్లుగా తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ కొండా నాగ వెంకటేశ్వరరావు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల డీఏలు పాల్గొన్నారు.

శనైశ్చరునికి భక్తుల తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లి శనైశ్చర స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజలు ద్వారా దేవస్థానానికి రూ. 2,08,985, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.49,472తో కలిపి మొత్తం రూ.2,58,457 ఆదాయం వచ్చినట్టు ఈఓ విజయలక్ష్మి తెలిపారు.

శనైశ్చరాలయంలో 'సోము' పూజలు

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు శనివారం మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. ఆయనకు ముందుగా బీజేపీ నాయకులు, పలువురు గ్రామస్తులు స్వాగతం పలికి ఆలయానికి తోడ్కొని వెళ్లారు. పూజాధికాల అనంతరం వేదపండితుల వేదాశీస్సులు అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణమోహన్, బీజేపీ నాయకులు సంపతి కనకేశ్వరరావు, నల్లా శ్రీరామప్రసాద్ తదితరులు ఉన్నారు.

నల్లతాచు హల్‌చల్

అంబాజీపేట: తొండవరం గ్రామానికి చెందిన గుత్తుల సూర్యనారాయణరావు ఇంటిలో నల్లతాచు శనివారం హల్‌చల్ చేసింది. సూర్యనారాయణ ఇంటిలో ఉన్న బీరువాలో పాము ఉండటాన్ని గుర్తించారు. దాంతో స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వవడంతో సూర్యనారాయణ ఇంటికి చేరుకుని పామును చాకచక్యంగా బంధించారు. అనంతరం జనావాసం లేని ప్రాంతంలో పామును విడిచిపెట్టినట్లు వర్మ తెలిపారు.

బాలాజీ ఆలయంలో కోలాహలం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం భక్తులతో శనివారం కోలాహలంగా మారింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. శ్రీ, భూ సమేత బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. గోదావరి వరద ప్రభావంతో గత వారం దర్శనాలు రద్దు కావడంతో దాని ప్రభావం స్పష్టంగా కనిపించింది. భక్తుల సంఖ్య గతం కన్నా తగ్గింది. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1,22,817 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు.

ఆరోగ్య సమాజం కోసమే న్యాయవ్యవస్థ


మాచవరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జడ్జి గౌరీశంకరరావు

అంబాజీపేట: ప్రజలకు న్యాయం అందించడంతో పాటు మెరుగైన విద్య, సంపూర్ణ ఆరోగ్యం అందించడం కోసమే న్యాయ వ్యవస్థ పని చేస్తుందని అమలాపురం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ సౌజన్యంతో జిల్లా కోర్టు ఆదేశాల మేరకు మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షత న్యాయవిజ్ఞాన సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గౌరీశంకరరావు మాట్లాడుతూ సమాజంలో ప్రజలు సంతోషంగా జీవించేవారు అక్రమాలు, అన్యాయాలు, గొడవలు వైపు కన్నెత్తి చూడరన్నారు. న్యాయం, చట్టం పరిధుల్లో నడుచుకునేవారు న్యాయస్థానాల వైపు రావాల్సిన అవసరం లేదన్నారు. న్యాయమైన విద్య, సంపూర్ణ ఆరోగ్యం లోపించిన వారే తమ పరిధులు దాటి అసాంఘిక కార్యక్రమాల వైపు వెళతారని, అటువంటి వాటిని అరికట్టేందుకే విద్య, సంపూర్ణ ఆరోగ్య సమాజం నెలకొల్పేందుకే మరో కోణంలో న్యాయ వ్యవస్థ పని చేస్తుందన్నారు. అమలాపురం ఏరియా ఆస్పత్రి, అంబాజీపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది 150 మంది రోగులు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడ్వకేట్లు భాస్కర శాస్త్రి, ఎం.షరీఫ్, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్, వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సుంకర పేరయ్యనాయుడు, వార్డు సభ్యుడు కొర్లపాటి ఢిల్లీ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణం కారణంగా డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంఅండ్‌హెచ్‌వో) ఎం.దుర్గారావుదొర అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు జై భీం కాలనీలో సంభవించిన డెంగీ జ్వరబాధితుల ఆరోగ్య పరిస్థితిపై శనివారం ఆరా తీశారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ జ్వర కేసులు జిల్లాలో 80 వరకు ఉన్నాయన్నారు. జిల్లాలో డెంగీ కేసులు జనవరి నుంచి జూలై నెలాఖరుకు 24 కేసులు నమోదయ్యాయన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 56 సాధారణ జ్వర కేసులు నమోదయ్యాయన్నారు. స్థానిక జై భీం నగరవాసి తమ బంధువుల ఆరోగ్య పరిస్థితిపై తిరుపతి వెళ్లిందని ఆమెకు డెంగీ సోకగా స్విమ్స్ ఆసుపత్రిలో తగిన పరీక్షలు చేయించుకొని వచ్చిందన్నారు. స్థానికంగా ఆమెకు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య సేవలు అందించగా పరిస్థితి అదుపులో ఉందన్నారు. దీంతో పాటు మరో డెంగీ కేసు బయటపడటంతో ఆమె అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో తమ సిబ్బంది ఆధ్వర్యంలో 50 ఇళ్ల ఒక యూనిట్ గా తీసుకొని అన్ని రకాల నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి రోజు స్టాఫ్ డయేరియా, డెంగీ, మలేరియా, పరిశుభ్రత అంశాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, వైద్యాధికారి వి.గౌతమి, ఈఓపీఆర్డీ బి.మమత, ఉప సర్పంచ్ బంధన రాంబాబు, ఎస్‌యుఓ ఎస్‌వీ రామారావు, సీహెచ్‌ఓ బి.అప్పారావు, పీహెచ్ఎన్ రత్నకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు జీవీవీ ప్రసాద్, జీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొత్తపేటలో కొబ్బరి కొనుగోలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: కొబ్బరి రైతులకు మేలైన ధర కల్పించేందుకు నాఫెడ్ – ఆయిల్‌ఫెడ్ సంస్థలు కొబ్బరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. స్థానిక ఏఎంసీ కార్యాయలం, మార్కెట్‌యార్డు వద్ద నాఫెడ్–ఆయిల్‌ఫెడ్ సంస్థలు ఏర్పాటు చేసిన కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. పలువురు రైతులు తీసుకువచ్చిన కొబ్బరిని అధికారులు కొనుగోలు చేశారు. ముఖ్యంగా నాణ్యమైన మిల్లింగ్ కొబ్బరి క్వింటాలు రూ.11,160, బాల్ కొబ్బరి క్వింటాలు రూ.12,000కు కొనుగోలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా దేశంలోను, రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆలోచన చేసి కొబ్బరి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు తమ కొబ్బరిని ఈ కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించడం ద్వారా మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తిపీటతో దాడి

అయినవిల్లి: ఆస్తి వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తిపీటతో శుక్రవారం సాయంత్రం దాడి చేశాడు. దీనిపై ఎస్సై వి.రాజేష్‌కుమార్ శనివారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి మండలంలోని శానపల్లిలంక తూర్పుపేటకు చెందిన తొత్తరమూడి వెంకన్నబాబు, తొత్తరమూడి నాగరాజు మధ్య శుక్రవారం సాయంత్రం ఆస్తి వివాదం నేపథ్యంలో గొడవ జరిగింది. దీంతో నాగరాజు కత్తిపీటతో వెంకన్నబాబుపై దాడి చేశాడు. గాయాలు పాలైన వెంకన్నబాబును అతని బంధువులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై వెంకన్నబాబు నుంచి రికార్డు నమోదు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్రావణమాస కార్యక్రమాలపై సమీక్ష

సఖినేటిపల్లి: ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసంలో అంతర్వేది దేవస్థానంలో చేపట్టే విశేష పూజలపై ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులతో సమీక్షించారు. శనివారం అంతర్వేది దేవస్థానం కార్యాలయంలో శ్రావణ శుక్రవారాల్లో నిర్వహించాల్సిన పూజల గురించి ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులతో ఏసీ సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ నెలలో 9, 16, 23, 30 తేదీలలో వచ్చే శుక్రవారాలలో స్వామివారి ఆలయంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో మహిళల సౌకర్యార్థం వరలక్ష్మి కుంకుమ పూజలు ఏర్పాటుపై ఏసీ సత్యనారాయణ వారికి సూచనలు చేశారు.

పరిమితికి మించిన వాహనాలకు కళ్లెం


అయినవిల్లిలో పంచాయతీరాజ్ నిర్మించిన రోడ్డుపై భారీ వాహనాలను అడ్డుకున్న డీఈ

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం హైస్కూల్ నుంచి అయినవిల్లి సొసైటీ వరకూ నిర్మించిన రహదారిపై హెవీ వెహికల్స్ వెళ్లడంతో పంచాయతీ రాజ్ నిధులతో ఏర్పాటు చేసిన రహదారి దెబ్బతిందని పంచాయతీరాజ్ డీఈ రాంబాబు అన్నారు. ఈ రహదారి దెబ్బతినకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శనివారం ఆయన ఈ రోడ్డులో వెళ్తున్న భారీ వాహనాలకు అడ్డుకున్నారు. ఈ రోడ్డులో రెండు నుంచి ఐదు టన్నుల బరువున్న వాహనాలు వెళ్లేందుకే అనుమతి ఉందన్నారు. ఈ రోడ్డును ఇటీవలే 1.6 కిలోమీటర్ల రహదారిని రూ.86 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు అభివృద్ధి చేసిన ఆరు నెలలకే దెబ్బతిందన్నారు. అలాగే అయినవిల్లి సచివాలయం–1లో సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ముక్తేశ్వరం హైస్కూల్ నుంచి అయినవిల్లి సొసైటీ వరకూ ఉన్న రహదారిని పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించేందుకు పాలక వర్గ సభ్యులతో ఆమోదించారు. ఈ సమావేశంలో రోడ్డు దెబ్బతినడానికి కారణమైన అంశాలను పంచాయతీరాజ్ డీఈ రాంబాబు గ్రామస్తులతో చర్చించారు. సమావేశంలో గ్రామ పెద్దలు ఉన్నారు.

వరద ముంపులోనే కనకాయలంక కాజ్‌వే


కనకాయలంక కాజ్‌వే వద్ద పడవలపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పి.గన్నవరం: మండలంలోని చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే ఇంకా వరద ముంపులోనే ఉంది. కాజ్‌వేపై మూడు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ గ్రామ ప్రజలు పడవలు దాటి పి.గన్నవరం మండలానికి వస్తున్నారు. అలాగే మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. లంక భూముల్లో బీర, బెండ, పచ్చిమిర్చి, తమలపాకు తదితర పంటలు వరదలకు పాడైపోవడంతో రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి


ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పుస్తకాలను అందజేస్తున్న చారిటబుల్ ట్రస్టు సభ్యులు

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు గుణ్ణం వీర్రాజు, గన్ని విష్ణు, గారపాటి త్రిమూర్తులు వ్యాఖ్యానించారు. జూనియర్ కళాశాలలో ప్రభుత్వం సమకూర్చిన ఉచిత నోటు పుస్తకాలను విద్యార్థులకు శనివారం వారు అందజేశారు. ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఫీజులను చారిటబుల్ ట్రస్ట్ చెల్లిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్పించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌ను సాధించుకోవాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు సాంబశివమూర్తి, అరుణకుమార్, గోవింద్, రఘు, సత్యనారాయణ, వేదమూర్తి, లలితాకామేశ్వరి, అరుణకుమారి, మాధురి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు

అంబాజీపేట: డెంగీ, విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతాలతో పాటు అన్ని చోట్ల పారిశుధ్య పనులు చేయించాలని అలసత్వం వహించవద్దని డీఎల్పీవో బొజ్జిరాజు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు జై భీమ్ నగర్‌లో డెంగీ కేసులు నమోదు కావడంతో శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ఎబేట్ మందు స్ప్రే చేయిస్తున్నామన్నారు. అలాగే బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ బి.మమత, కార్యదర్శి రాయి ఏడుకొండలు, చంటి పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

మలికిపురం: వరద ప్రభావిత ప్రాంతమైన రామరాజులంకలో శనివారం పశువులకు ఉచిత దాణా పంపిణీ చేశారు. నాలుగు రోజులకు అవసరమైన దాణా పంపిణీ జరిగింది. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, పశు వైద్యాధికారి డాక్టర్ డి.శివకుమార్ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 70 మంది రైతులకు 40 పశువులకు సరిపడా నాలుగు టన్నుల దాణా అందించారు. దిండిలో 16 మంది రైతులకు 51 పశువులకు 1000 కేజీల దాణా అందించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ముదునూరు శ్రీనివాసరాజు, కాకర శ్రీనివాస్, ఎంపీటీసీ తాడి దుర్గ, నల్లి శివకుమార్, పి.సూర్యనారాయణరాజు, రైతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు అమృత తుల్యం


అంబాజీపేటలో బాలింతలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి

అంబాజీపేట: తల్లిపాలు బిడ్డకు అమృత తుల్యమని పుట్టిన గంటలోపే ముర్రుపాలను శిశువుకు ఇవ్వవచ్చని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంబాజీపేట కొర్లపాటివారి పాలెంలో కాపు సామాజిక భవనంలో సీడీపీఓ వెంకటేశ్వరి అధ్యక్షతన తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఉప సర్పంచ్ సుంకర పేరయ్యనాయుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆలమూరు: తల్లిపాల సంస్కృతిని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించి శిశువులకు మెరుగైన ఆరోగ్యాన్ని, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించాలని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పి.శారద అన్నారు. మండలంలోని ఆలమూరు, చింతలూరు. చెముడులంక గ్రామాల్లో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో వైద్యారోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మామిడికుదురు: పుట్టిన బిడ్డకు గంట లోపే ముర్రుపాలు తాగించాలని సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, జాలెం రమణకుమారి, గెద్దం మంగాలక్ష్మి, కొనుకు ప్రేమజ్యోతి సూచించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శనివారం పాశర్లపూడిలంక, నగరం, అప్పనపల్లి, పాశర్లపూడి, పెదపట్నంలంక గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు బియ్యం పంపిణీ

అంబాజీపేట: వరద తీవ్రత వల్ల ముంపునకు గురైన 18 మంది బాధిత కుటుంబాలకు అంబాజీపేట శివారు స్త్రీల ఆస్పత్రి వద్ద బియ్యంను శనివారం పంపిణీ చేశారు. సచివాలయం–2లో 13, సచివాలయం 3లో ఐదుగురు బాధితులకు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సుంకర బాలాజీలు అందజేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున కంది పప్పు, వంట నూనె, బంగాళదుంపలు, ఉల్లిపాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఎంవీ రమణ, కోమలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఏపీఓగా కృష్ణ

అంబాజీపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానిక ఏపీఓగా అడపా శ్రీవెంకటకృష్ణ ఉద్యోగ బాధ్యతలను శనివారం స్వీకరించారని ఎంపీడీవో జి.సరోవర్ తెలిపారు. శ్రీవెంకటకృష్ణ కాట్రేనికోన మండలంలో ఏపీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారన్నారు. అలాగే ఇక్కడ ఏపీఓగా విధులు నిర్వహించిన బొంతు చంద్రమోహన్ బదిలీపై కాట్రేనికోన మండలం వెళ్లారన్నారు. ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించి, 100 రోజులు పనిదినాలు వచ్చేలా కృషి చేస్తానని కృష్ణ తెలిపారు.

ఏపీఓగా అరుణకుమారి


జి.అరుణకుమారి

ఆలమూరు: ఉపాధి హామీ పథకం అదనపు ప్రోగ్రాం అధికారి (ఏపీఓ)గా జి.అరుణకుమారి నియమితులయ్యారు. గత ఏడాదిగా ఏపీఓ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పీవీవీ ప్రసాద్ నుంచి శనివారం ఆమె బాధ్యతలు తీసుకున్నారు. రామచంద్రపురం నుంచి బదిలీపై వచ్చిన ఏపీఓ అరుణకుమారి మండల ఏపీఓగా పనిచేసిన అనుభవం ఉంది. జాబ్‌కార్డులు కలిగిన ఉపాధి కూలీలందరికి పనులు కల్పించడంతో పాటు సకాలంలో వేతనాలు అందిచేందుకు కృషి చేస్తానని ఏపీఓ హామీ ఇచ్చారు.

వైభవంగా సత్సంగ్ సమావేశాలు

అంబాజీపేట: హనుమత్ కాళీవరప్రసాద్ బాబూజీ మహరాజ్ వారి పరమ అనుగ్రహంతో శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతులు యోగిని చంద్రకాళీప్రసాద్ మాతాజీ ఈ నెల 3 నుంచి 6 వరకు అంబాజీపేటలో నిర్వహించనున్నట్లు బాబూ భక్త సమాజ్ నిర్వాహకులు తెలిపారు.

సొమ్ములు కట్టలేదని అధ్యక్షురాలిపై ఆరోపణ

మామిడికుదురు: బ్యాంకుకు చెల్లించమని ఇచ్చిన సొమ్ము రూ.2.20 లక్షలు బ్యాంకుకు చెల్లించలేదని ఆదుర్రు గ్రామానికి చెందిన భారతి గ్రూపు అధ్యక్షురాలిపై సంఘం సభ్యులు ఆరోపించారు. 2018 నుంచి 2023 వరకు బ్యాంకుకు చెల్లించమని ఇచ్చిన సొమ్ము చెల్లించలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేయగా విచారణ చేయమని కలెక్టర్ ఏపీఎంను ఆదేశించారన్నారు. కానీ కలెక్టర్ ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదన్నారు. శనివారం విచారణకు వస్తున్నానని చెప్పి ఏపీఎం గైర్హాజరయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో సంఘం కార్యదర్శి పెదమల్లు రామలక్ష్మి, సభ్యులు, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా దీనిపై ఏపీఎం అజయ్‌ను వివరణ కోరగా డీఆర్‌డీఏ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఉన్నందున, దీనిపై సోమవారం విచారణ చేస్తానని చెప్పారు.

సహోద్యోగిపై కేసు

అంబాజీపేట: ఒక సచివాలయ ఉద్యోగి మరో సహోద్యోగినిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల పింఛన్ల పంపిణీ పూర్తి కాగా మరో మూడు పింఛన్లు మిగిలాయి. మాచవరంలో ఓ వృద్ధుడికి పింఛన్ ఇవ్వాలి. నందంపూడి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దోనిపాటి రాంజీ తన ఫోన్‌లో చార్జింగ్ లేదని చెప్పి, ఆ వృద్ధుడికి పింఛన్ ఇవ్వాలని సహోద్యోగిని కోరాడు. ఆమె అక్కడకు వచ్చి ఇంట్లోకి వెళ్లగానే రాంజీ తలుపు వేయడంతో ఆమె భయపడి బయటకు వచ్చేసిందన్నారు. తర్వాత మెస్సెజ్‌లు పెట్టి వేధిస్తున్నాడని ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.